క్లుప్తంగా

విజయ దుర్గాదేవికి వెండి పాదాలు



ధర్మకర్తకు వెండి పాదాలు అందజేస్తున్న దాతలు

మధురవాడ: మధురవాడ టైలర్స్ కాలనీలో కొలువుదీరిన శ్రీ విజయదుర్గా దేవికి శివశక్తినగర్‌కు చెందిన భక్తులు నాగబాబ్జీ, సునీత దంపతులు వెండి పాదాలు అందజేశారు. 759 గ్రాముల బరువు గల వెండి పాదాలను ఆలయంలో ధర్మకర్త బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతుల సమక్షంలో శుక్రవారం వారు అందజేశారు.

నేటి నుంచి దీక్షాపరులకు నిత్యాన్నదానం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠంలో శనివారం నుంచి డిసెంబరు 12 వరకు 41 రోజుల పాటు నిత్యాన్నదాన కార్యక్రమం జరగనుంది. రోజూ మధ్యాహ్నం 12.05 గంటల నుంచి 2.05 గంటల వరకు జరిగే నిత్యాన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప, భవాని, శివస్వాములతో పాటు వివిధ దీక్షాపరులు పాల్గొనాలని పీఠం ధర్మకర్త గాదు తాతినాయుడు కోరారు. ఎనిమిదేళ్లుగా ఈ భిక్షా కార్యక్రమం నిరాటంకంగా సాగుతోందన్నారు.

నేరేళ్లవలస గ్రామ సభలో 26 దరఖాస్తులు



నేరేళ్లవలసలో నిర్వహిస్తున్న గ్రామ సభ

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలసలో రీ సర్వేలో తప్పుల సవరణ కోసం శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో 26 దరఖాస్తులు వచ్చాయి. పేర్లు, విస్తీర్ణం సరి చేయాలని కోరుతూ ఇచ్చిన దరఖాస్తులను డిప్యూటీ తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ వరలక్ష్మి, సారిక శంకరరావు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



బాలిక తండ్రికి రూ. 10 వేలు అందిస్తున్న అశోక్ చక్రవర్తి

భీమునిపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిల రాణి అనే బాలికకు సుందరమ్మ రామున్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ శుక్రవారం ఆర్థిక సాయం అందించింది. బాలిక తండ్రి మద్దిల శ్రీనివాసరావుకు ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి, ట్రస్టీ చెట్టి సింహాచలం రూ. 10 వేలు అందించారు.

రీ సర్వేకు వారం రోజుల్లో దరఖాస్తులు

తగరపువలస: రీ సర్వేలో లోపాలను సవరించుకోవడానికి వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని భీమిలి తహసీల్దార్ పైల రామారావు సూచించారు. భీమిలి మండలం టి.నగరపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుదారులు తెలియజేసిన అభ్యంతరాలను డిసెంబరు 31లోగా పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, సర్వే డీటీ లక్ష్మీకుమారి, మండల సర్వేయర్ రమేష్, వీఆర్వో పోతిన వెంకట అప్పారావు, కార్యదర్శి శశికళ, పల్లా సన్యాసిరావు పాల్గొన్నారు.

జ్ఞాన దీపాలు వెలిగించాలి

భీమునిపట్నం: దీపావళి రోజు ఇంటి వద్ద దీపాలు వెలిగించినట్లే, మన లోపల కూడా జ్ఞాన దీపాలను వెలిగించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అదే అసలైన దీపావళి అని, ఇది అందరికీ మేలు చేస్తుందని అన్నారు. విజయరాంపురానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు గురువారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల రోడ్డు, రొట్టెవీధి, గొల్లవీధి, ఎగువపేట ప్రాంతాల్లో ఈ ప్రచారం సాగింది. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు పాల్గొన్నారు.

భీమిలి రోడ్డు విస్తరణ ఎప్పుడో?

- కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు
- ఇరుకు మార్గంలో నిలిచిపోతున్న ట్రాఫిక్
- నిత్యం వాహనచోదకుల అవస్థలు



అంబేడ్కర్ కూడలి వద్ద ఇరుకైన మార్గంలో వాహనాలు



ఇరుకైన రహదారిలో భవన నిర్మాణ మెటీరియల్



భీమిలి రోడ్డులో ఒకపక్క వాహనాల నిలిపివేత, మరోపక్క రాకపోకలు

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి భీమిలి వెళ్లే రహదారిలో ట్రాఫిక్‌తో ప్రయాణికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి ఆంధ్రా బ్యాంక్ కూడలి వరకు వాహనాలతో ఈ మార్గం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా భీమిలి, నెల్లిమర్ల నియోజకవర్గాలకు చెందిన విద్యాసంస్థల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తగరపువలస–భీమిలి రహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో చాలాసార్లు ఈ మార్గాన్ని 80, 150 అడుగులకు విస్తరించనున్నట్టు వచ్చిన ప్రతిపాదనల కారణంగా సర్వే చేసి మార్కింగ్ కూడా చేశారు. కానీ విస్తరణ మాత్రం జరగలేదు. ప్రస్తుతం తగరపువలస నుంచి భీమిలి వరకు 30 అడుగులకు మించి రహదారి లేదు.

అసలే ఇరుకు.. ఆపై వాహనాలు

అంబేడ్కర్ కూడలి నుంచి పాత ఆంధ్రా బ్యాంక్ వరకు రహదారి 18 అడుగుల మేరకే ఉంది. ఈ ఇరుకైన రహదారిపై ఎప్పుడు చూసినా రవాణా వాహనాలు తిష్ట వేస్తాయి. కొందరు కార్లు, ద్విచక్రవాహనాలను ఎక్కడపడితే అక్కడ వదిలేసి పోతారు. దీంతో వాహనదారులు ప్రత్యామ్నాయంగా చిట్టివలస బొగ్గురోడ్డు, సంతపేట–తాతా థియేటర్ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కారణంగా ఈ మార్గాలు కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిపోతుంటాయి.



ప్రమాదకరంగా ఆంధ్రా బ్యాంక్ కూడలి

వ్యాపారులలో కొరవడిన సామాజిక చైతన్యం

ఇరుకైన ఈ రహదారి స్థానిక వ్యాపారుల నైజంతో మరింత ఇరుకుగా మారిపోయింది. బడా వ్యాపారులు తమ వ్యాపార సంస్థల ముందు స్థలాలను చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తుంటారు. దీంతో బీటీ రోడ్డు అంచు వరకు వందలాది మంది చిరు వ్యాపారులు తమ అడ్డాగా మార్చేసుకుంటున్నారు. పైగా ఏ వ్యాపార సంస్థకూ పార్కింగ్ సౌకర్యం లేకపోడం మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ఇది చాలదన్నట్టు చుట్టుపక్కల నివాసం ఉండేవారు భవన నిర్మాణ మెటీరియల్, డెబ్రిస్‌లను రోడ్డుమీదే డంప్ చేస్తుంటారు.

ఆంధ్రా బ్యాంక్ కూడలి నుంచి చిట్టివలస చెరువు మొదటి మదుం వరకు కొత్త వ్యాపారులు రాత్రివేళ రెడీమేడ్ బడ్డీలతో ప్రత్యక్షం కావడంతో రహదారి మరింత కుదించుకుపోతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, తమ ఇబ్బందులను గమనించి రహదారిని విస్తరించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.



ముందుకు వెళ్లేందుకు మార్గమేదీ?

విస్తరించకుంటే ప్రమాదం



భీమిలి నియోజకవర్గంలోనే అత్యంత రద్దీగా ఉండే తగరపువలస–భీమిలి రోడ్డును కనీసం 80 అడుగుల మేరకు విస్తరించాలి. లేదంటే ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదాలు జరిగి, భారీ నష్టం వస్తుందో చెప్పడం కష్టం.

– జీరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

అన్ని రోడ్లు ఇరుకే ..



దశాబ్దాలు గడిచే కొద్దీ భీమిలి జనాభా పెరుగుతోంది. నివాసాలు, వాహనాలు పెరుగుతున్నాయి. రహదారులు మాత్రం పెరగకుండా ఇరుకైపోతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే హడలిపోతున్నాం.

– ఎ.నాగేశ్వరరావు, టైలర్

రాజకీయజోక్యం లేకుండా విస్తరణ జరగాలి



పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా తగరపువలస–భీమిలి రహదారి విస్తరణ జరగాలి. ముఖ్యమైన కూడళ్ల వద్ద 18 అడుగుల రహదారి ఏ మాత్రం సరిపోదు. రాజకీయజోక్యం లేకుండా అభివృద్ధే ప్రధానంగా విస్తరణ జరగాలి.

– వెంపాడ వెంకటరమణ, బంగ్లామెట్ట

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: ఆనందపురం మండలంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వీటిలో బీపీ కళ్లాల నుంచి ఆకుల వారి కళ్లాలకు రూ.30 లక్షలతో, బోని రోడ్డు నుంచి దొంతల వారి కళ్లాలకు రూ.15 లక్షలతో రోడ్లు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానికులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

ఇసుక తవ్వితే చర్యలు

'గోస్తని' వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



గోస్తని నది వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు సమీపాన గోస్తని నదిలో ఇసుక తవ్వకూడదని హెచ్చరిస్తూ రెవెన్యూ అధికారులు శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గోస్తని నదిలో నుంచి ఎడ్ల బళ్లతో ఇసుక తరలిస్తుండడంతో ఈ బోర్డులు ఏర్పాటు చేశారు. ఇసుక తవ్వి, తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీటీ చంద్రశేఖర్, బీజేపీ నాయకులు

పద్మనాభం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పద్మనాభం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద డిప్యూటీ తహసీల్దార్ కె.చంద్ర శేఖర్, జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ నివాళులర్పించారు. గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెడ్డిపల్లి వీఆర్వో మంత్రి ప్రగడ వీర్రాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో..

తగరపువలస: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రాధాన్యత గురించి తెలియజేశారు.

పింఛనుదారుల నిరీక్షణ



ఆనందపురం మండలం శిర్లపాలెం కూడలిలో పింఛన్ కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు



ఆనందపురం గ్రామ సచివాలయంలో వేచి ఉన్న పింఛనుదారులు

సర్వర్ మొరాయింపుతో తప్పని అవస్థలు

తగరపువలస : సామాజిక పింఛన్ల పంపిణీకి భీమిలి నియోజకవర్గంలో లబ్ధిదారులు శుక్రవారం మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సి వచ్చింది. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది కోసం ఉదయం నుంచి కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన లబ్ధిదారులు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వైపు పరుగులు తీశారు. ప్రారంభంలో కాసేపు పింఛన్ల పంపిణీ జరిగింది. ఉదయం 7 గంటల నుంచి సర్వర్ మొరాయించింది. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలతో పాటు జీవీఎంసీ భీమిలి, మధురవాడ జోన్‌లలో ఈ అవస్థల కారణంగా పింఛనుదారులు కొద్దిసేపు ఆందోళన చెందారు. అక్కడక్కడ ఉదయం 10 గంటల తరువాత నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో సర్వర్ పనిచేయడంతో ఉద్యోగులు పరుగులు పెట్టారు. మధ్యాహ్నం నుంచి పూర్తిగా పని చేయడంతో ఉద్యోగులు, పింఛనుదారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫ్రీడం కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవితేజ, శ్రీనివాసరావు

భీమునిపట్నం: అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్(ఏబీసీ) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ పోటీలు భీమిలిలోని వుడా మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏబీసీ గౌరవ అధ్యక్షుడు గంటా రవితేజ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలకు తన వంతు సహాయ, సహకారాలను అందిస్తానన్నారు. ఏబీసీ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో మొత్తం 14టీంలు పాల్గొంటున్నాయని, రౌండ్ రాబిన్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 1న ఫైనల్ పోటీలు ఉంటాయని తెలియజేశారు. కార్యదర్శి గొలగాని నరేంద్ర మాట్లాడుతూ ఇక్కడ జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు త్వరలో ఏబీసీలో సభ్యత్వం కల్పించి, శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, ఏబీసీ సహాయ కార్యదర్శి అడిదం అంజనికుమార్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షలు విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షలు అందిస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు

తగరపువలస: వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు సీఎం చంద్రబాబుకు గత నెల 30న విజయవాడలో రూ.10 లక్షల సాయం అందించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు శుక్రవారం ఆనందపురంలో వివరాలు తెలిపారు. బీసీ కులాల గణన, చట్టసభలలో బీసీలకు 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం, బీసీలకు ప్రత్యేక చట్టం, బీసీ వసతిగృహాలకు నూతన భవనాల నిర్మాణం, మెరుగైన సదుపాయాలు కల్పించాలని సీఎంను కోరినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, యూత్ అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, జాతీయ అధ్యక్షుడు కాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

తగరపువలస: స్థానిక గుజ్జు రామునాయుడు భవన్ వద్ద గురువారం ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవం, గురుదాస్ గుప్తా 5వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కార్యాలయం ఆవరణలో మాజీ కౌన్సిలర్ చిల్ల నరసింహులు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు, చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాగణపతి ఆలయానికి విరాళం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు వలందపేట శ్రీవిద్యాగణపతి సహిత సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్పస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన ఎరుసు సూరమ్మ శుక్రవారం రూ.5వేలు అందించారు. ఆలయంలో ధూప దీప నైవేద్యాల నిమిత్తం ఈ నగదును వినియోగించాలని కోరారు. ఆ నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు నగిరెడ్ల రాంబాబు, కోశాధికారి డెక్కతి శివారెడ్డి, కంబపు దుర్గారెడ్డికి అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో బీపీ కళ్లాలు, ఆకుల మెట్ట, గొట్టిపల్లి కళ్లాలు, పల్లిపేట, మచ్చవానిపాలెం తదితర గ్రామాలలో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థులకు గణితంలో శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) శిక్షణ తరగతులలో భాగంగా శుక్రవారం అనకాపల్లి జిల్లా మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం చిట్టివలస సత్యసాయి సేవాసమితి కన్వీనర్ గొట్టిపల్లి సత్యనారాయణ విద్యార్థులకు స్వీట్లు, బిస్కట్లు అందించారు. కార్యక్రమంలో నగరంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ఉపాధ్యాయుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంగా ఇళ్లు కూల్చేశారు

ఇద్దరు మహిళల ఆందోళన



మద్దతుదారులతో ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

భీమునిపట్నం: ఆనందపురం మండలం ఎల్వీపాలెం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన కంటిబోయిన పద్మ, కంటిబోయిన రాజీ అనే ఇద్దరు మహిళలు శుక్రవారం భీమిలి ఆర్డీవో కార్యాలయం వద్ద తమ మద్దతుదారులతో ఆందోళన చేశారు. తమ ఇళ్లను రెవెన్యూ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని ఆరోపిస్తూ.. న్యాయం కోరారు. సుమారు 30 ఏళ్లుగా ఈ స్థలంలో నివసిస్తున్నట్లు తెలిపారు. ఈ స్థలంపై తమకు పూర్తి హక్కు ఉందని, అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని వాదిస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ విషయమై ఆర్డీవో కోర్టులో కేసు నడుస్తోందని, మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అయినప్పటికీ గత నెల 23న అధికారులు తమ ఇళ్లను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పరిపాలన అధికారి మనోరంజనికి వినతిపత్రం అందించారు.

ఉత్సాహంగా ఏక్తా దివస్



పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్‌లో ఏక్తా దివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ పూల మాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ వద్ద నుంచి పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వరకు పరుగు నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–2 జెడ్సీ పి. సింహాచలం, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గీతంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ యువజన కేంద్ర జిల్లా యువజన విభాగం అధికారి జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు వేళాయె..

- ముస్తాబైన శివాలయాలు
- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు



కొమ్మాది అష్టలక్ష్మి ఆలయంలో స్ఫటిక లింగ స్వరూపుడు

కొమ్మాది: కార్తీక పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కావడంతో భక్తులు పూజలకు సన్నద్ధమవుతున్నారు. కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయం ప్రాంగణంలోని శ్రీ మంగళగౌరీ సమేత వైశాఖేశ్వర దేవాలయంలో స్ఫటిక లింగస్వరూపంలో దర్శనమిచ్చే స్వామిని చూడచక్కగా ముస్తాబు చేశారు. ఈ నెల 4వ తేదీన మొదటి సోమవారం పూజలు ఉదయం 5 గంటల నుంచి విశేష హారతి, సహస్ర దీపాలంకరణ సేవతో ప్రారంభం కానున్నాయి. మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రి, ఎండాడ శివాలయం, రుషికొండలో శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.



పూజలకు సిద్ధమైన సిద్ధేశ్వరస్వామి పీఠం

ఏర్పాట్లు పూర్తి

మధురవాడ: కార్తీక మాస పూజలకు మధురవాడలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో పూజలకు, దర్శనాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల రోజులు వేకువ జాము నుంచే పూజలు ప్రారంభమవుతాయని ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, మధురవాడలో సిద్ధేశ్వర స్వామి పీఠంలోని శ్రీ అన్నపూర్ణా సమేత సిద్ధేశ్వర దేవీ సహిత సిద్ధేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి చెప్పారు.

ఆనందోత్సాహాల నడుమ 'దీపావళి'



పీఎం పాలెంలో మతాబాలు కాలుస్తున్న చిన్నారులు, మహిళలు



కబడ్డీ కోర్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న క్రీడాకారులు

పీఎం పాలెం: దివ్వెల పండగ దీపావళిని నియోజకవర్గవాసులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా,పెద్ద ఉత్సాహంగా బాణసంచా కాల్చారు. కాలనీలు మతాబుల వెలుగులో ధగధగలాడాయి. బాణసంచా బాంబుల మోతలతో మార్మోగాయి. కారుషెడ్ శివాలయం, బబ్బేలమ్మ ఆలయం, పీఎం పాలెం ఆఖరు బస్టాపు వద్ద గల శ్రీ శృంగేరీ శంకరమఠం ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

కబడ్డీ కోర్టుకు దీప కాంతులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులు కోర్టు వద్ద దీపావళి వేడుకలు జరుపుకొన్నారు. తాము క్రీడల్లో రాణించడానికి ఉపయోగపడిన కబడ్డీ కోర్టు లైన్ల వద్ద వరుసగా దీపాలు వెలిగించారు. పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు సుమారు 500దీపాలు వెలిగించారు.